ఆన్‌లైన్ కష్టాలు తొలిగేదెన్నడో..?

- ఈ నెల 28 వరకు పరీక్ష ఫీజు గడువు పొడిగింపు
- విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదుకు అధికారుల ఆదేశాలు
- ఆటంకంగా మారిన కొత్త నిబంధనలు



దోమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ అవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

దోమకొండ: పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులను ఆన్‌లైన్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లింపు గడువు ముగియగా, ఆన్‌లైన్‌లో ఇబ్బందులతో ఈనెల 28 వరకు ప్రభుత్వం గడువును పొడిగించింది. ఆ లోగా విద్యార్థుల వివరాల నమోదును పూర్తి చేసి ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది పరీక్షల విభాగం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలతో సమస్య ఏర్పడింది. పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఏ ఒక్క విద్యార్థి వివరాలు నమోదు చేయకపోయినా ఆ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపునకు ఆటంకం ఏర్పడుతోంది. గతేడాది వరకు కేవలం పదో తరగతి విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉండేది. విద్యార్థులు మరో పాఠశాలకు మారడం, కొత్తగా ప్రవేశం పొందడం, కొందరు మధ్యలో పాఠశాలను వదిలి వెళ్లిపోవడం వంటి కారణాలతో సమస్య ఏర్పడింది.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు..

కామారెడ్డి జిల్లాలో 300 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల, కస్తూర్బా పాఠశాలలు ఉండగా, సుమారు 13 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరి వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేసి సమాచారాన్ని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(బీఎస్‌ఈ)కు బదిలీ చేస్తే పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. కానీ సాంకేతిక సమస్య కారణంగా పోర్టల్ నమోదుకు ఆటంకాలు ఎదరవుతున్నాయని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థుల వివరాలను, వారి పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు వివరాలను స్థానికంగా కంప్యూటర్ నిర్వహకుల ద్వారా చేయిస్తున్నారు. కానీ సాంకేతిక సమస్యల కారణంగా పోర్టల్‌లో నమోదుకు ఆలస్యమవుతోంది. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని సాంకేతిక సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఛత్రపతి శివాజీ బాటలో నడవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఛత్రపతి శివాజీ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎంపీ బీబీపాటిల్ సోదరుడు రాంపాటిల్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో సోమవారం ఆర్యక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శివాజీ భారీ విగ్రహాన్ని దేశంలో ఏర్పాటు చేయడానికి ప్రధాన మంత్రి మోదీ కృతనిశ్చయంతో ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులను సన్మానించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహదేవ్ మహారాజ్, ఆర్యక్షత్రియ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, వైస్ ఎంపీపీ నర్సిములు, మాజీ సర్పంచ్ సంజీవులు, వీడీసీ చైర్మన్ రాజు, మనోహర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాంపాటిల్, మహదేవ్‌మహారాజ్ తదితరులు

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి



రామారెడ్డి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామారెడ్డి ఏఎస్సై రవీందర్ సూచించారు. సోమవారం మద్దికుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. షీటీం, సైబర్ క్రైమ్, ఏహెచ్‌టీయూ గురించి అవగాహన కల్పించారు. షీటీం నెంబర్ 8712686094, టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని తెలిపారు. డయల్ 100, 108, 1930, 181 నంబర్ల ప్రాముఖ్యత, అత్యవస పరిస్థితుల్లో వాటి విలువను విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి మహిళ తన ఫోన్‌లో టి–సేఫ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం బాన్సువాడలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఈపీఎస్ 95 పెన్షన్‌దారుల హైయర్ పెన్షన్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కనీస పింఛన్ రూ.7500లతో పాటు డీఏ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ అధ్యక్షుడు కౌసర్, ఫరీద్, యేసయ్య, పండరి, మహమూద్, ప్రభు, మహమూద్, రాములు, పండరి, లక్ష్మణ్, గంగారం, నారాయణ తదితరులున్నారు.

పంచకర్మ చికిత్స ప్రారంభం

కామారెడ్డి అర్బన్: ప్రాచీన వైద్య విధానం పంచకర్మ చికిత్స స్థానికంగా లభించడం సంతోషంగా ఉందని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ ఎ.చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని సుభాష్ థియేటర్ సమీపంలో సంకల్ప ఆయుర్వేద ఆస్పత్రిని చంద్రశేఖర్‌రావుతో పాటు ప్రొఫెసర్ డాక్టర్ పి.రామలింగం, ఆయుర్వేద వైద్యుడు వెన్నెల రుద్రమణి, మృత్యుంజయ్, అనురాధ, మోహన్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మట్లాడుతూ.. పంచకర్మ, అభ్యంగ, ఉద్వర్తన, ఆవిరి స్నానం, కటి బస్తి, జాను బస్తి, నాడి స్వేద, తైలధార, పిండ స్వేద, అగ్నికర్మ లాంటి వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చినందుకు నిర్వాహకులను అభినందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కమిషన్ మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, ఆయుర్వేద వైద్యులు

నేడు రేపు ఉచిత ఫైబ్రోస్కాన్ పరీక్షలు

కామారెడ్డి అర్బన్: స్థానిక వేద గ్యాస్ట్రో లివర్ కేర్ ఆస్పత్రిలో లివర్ డామేజ్‌ను పసిగట్టే ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఈనెల 26, 27 తేదీల్లో ఉచితంగా చేయనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధి బోగి రవి తెలిపారు. ఆల్కహాల్ అలవాటు, బీపీ, షుగర్, థైరాయిడ్, అధిక బరువు కలిగి ఫ్యాటీ లివర్‌లో బాధపడే వారు రూ.5వేల విలువైన ఫైబ్రోస్కాన్ పరీక్షను ఉచితంగా చేయించుకోవాలని సూచించారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య ఆస్పత్రిలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఉచితంగా మధుమేహ(షుగర్) పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ అజయ్ పేరాల తెలిపారు. పరీక్షలు చేయించుకునే వారు తినకుండా రావాలని, తిన్న తర్వాత మరో పరీక్ష చేస్తారన్నారు.

ఎండీఎం జిల్లా స్థాయి పోటీలు



కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు సోమవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి భోజన పోటీలను నిర్వహించారు. అన్ని మండలాల నుంచి ఒక్కరి చొప్పున నిర్వాహకులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా డీఈవో ఎస్.రాజు హాజరయ్యారు. వంటలను రుచి చూశారు. పోటీలో గాంధారి మండలం ప్రథమంగా, భిక్కనూరు ద్వితీయ, మాచారెడ్డి మండల నిర్వాహకులు తృతీయ బహుమతులు పొందారు. వీరికి నగదును బహుమతిగా అందజేశారు. విద్యా శాఖ కో–ఆర్డినేటర్ కృష్ణ చైతన్య, హెచ్‌ఎం గంగాకిషన్, ఎన్జీవో ప్రతినిధి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్ట్రా సోనోగ్రఫీతో గర్భధారణ చికిత్సలు



మాచారెడ్డి: ఆవులు, గేదెలు ఏవైనా గర్భం దాల్చకపోతే అల్ట్రా సోనోగ్రఫీతో పరీక్షించి గర్భధారణ చికిత్సలు చేస్తామని మండల పశు వైద్యాధికారి రవికిరణ్ అన్నారు. లచ్చాపేటలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి రవికిరణ్ మాట్లాడుతూ.. రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లింగ నిర్ధారిత వీర్యం గురించి కూడా అవగాహన కల్పించారు. నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. లచ్చాపేట డెయిరీ అధ్యక్షుడు వెంకన్న, మాచారెడ్డి పశువైద్యులు రాంచందర్, హేమశ్రీ, సిబ్బంది గంగరాజు, రిజ్వాన్, షరీఫ్, శ్యాంగౌడ్, స్వామి ఉన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



దోమకొండ: మండల కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో సోమవారం దోమకొండ ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయంగా మహిళలపై జరుగుతున్న హింస, బాలల హక్కులు చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గడికోట ట్రస్ట్ సీనియర్ మేనేజర్ బాబ్జీ మాట్లాడారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలు, వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వసంత్‌కుమార్, రజిత, సఖి సెంటర్ కో–ఆర్డినేటర్‌తో పాటు గడికోట ట్రస్టు ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాలు చేసే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు



రఫియొద్దిన్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రజల విశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్‌కు ధర్నాలు చేసే నైతిక హక్కు లేదని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫియొద్దిన్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర సమితి పాలనలో గిరిజనులపై లేని ప్రేమ ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. లగచర్ల మంటను మానుకోటకు విస్తరించాలన్న మీ ప్రయత్నాన్ని కుయుక్తులను, దురాలోచనలను చైతన్యవంతులైన మహబూబాబాద్ ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నిస్తే జైల్లో పెట్టిన ఘటనలు మార్చిపోయారా అని మండిపడ్డారు. ధర్నాలు, రాస్తారోకోలు అంటూ అమాయక ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు.

కొత్త వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి వాగుపై కొత్త వంతెనను నిర్మించడానికి అనువుగా ఉన్న స్థలాన్ని ఆర్‌అండ్‌బీ డీఈ నారాయణ సోమవారం పరిశీలించారు. కల్యాణి వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో పాత వంతెన ఎత్తు తక్కువగా ఉన్న కారణంగా రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేకు సూచించడంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదిత వంతెన స్థలాన్ని పరిశీలించారు. ఏఈ ఐశ్వర్య, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

మాల సంఘం యువజన విభాగం జిల్లా కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: మాల సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కామిల్ల రాజేందర్‌లు నియమితులయ్యారు. నియామక పత్రాన్ని సోమవారం రాష్ట్ర నాయకులు అయ్యాల సంతోష్ సోమవారం అందజేసి వారిని సన్మానించారు. నాయకులు సంకి రతన్‌కుమార్, కప్ప సత్యం సిద్ధార్థ్‌రాజ్, ఐండ్ల ప్రభాకర్, దెబ్బటి రవి, గుర్రం మోహన్ తదితరులు పాల్గొని అభినందించారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ చైర్‌పర్సన్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా సౌజన్య, వైస్ చైర్మన్‌గా పరమేష్, డైరెక్టర్లు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఒత్తిళ్లు రావడంతో ఇంటర్వ్యూ ద్వారా ఎన్నుకోవాల్సి వచ్చిందని అన్నారు. చైర్ పర్సన్ పదవి అర్హురాలికి దక్కిందని అన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. డైరెక్టర్లుగా అనిల్‌కుమార్, రామగొండ, చౌలావార్ శంకర్, జాదవ్ హరి, హన్మంత్, మహమ్మద్ అహ్మద్, రాంచందర్, మాయవతి, జాదవ్ హన్మంత్, ఇబ్రహీం, విఠల్, అశోక్ బాధ్యతలు చేపట్టారు. డోంగ్లీ మండలంలోని కుర్లాలో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, దోతిలో అంగన్‌వాడి భవన నిర్మాణం కోసం సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సౌజన్య, పక్కన ఎమ్మెల్యే

పశుగణన ప్రారంభం



భిక్కనూరు: మండల కేంద్రంలో పశుగణన కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి దేవేందర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఈ పశుగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తామన్నారు. ఉన్న పశువులను బట్టి దేశవ్యాప్తంగా పశువుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి, ప్రవేశపెట్టాల్సిన సంక్షేమ పథకాల గురించి కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని తీసుకుంటుందని ప్రతి ఒక్కరూ పశుగణనకు సహకరించాలని కోరారు. ఎన్యుమరేటర్లు ముదాం సురేష్, కృష్ణ, మహేశ్‌గౌడ్, అనిత, సందీప్, భరత్ పాల్గొన్నారు.

వర్గీకరణపై కాంగ్రెస్ తాత్సారం

మాచారెడ్డి: ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ తాత్సారం చేస్తోందని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ అన్నారు. సోమవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్యేల్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్ట రమేష్, నాయకులు చుక్కాపురం నాగరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు సట్టిగారి లక్ష్మి, బట్ట వెంకటరాములు, బానపురం లావణ్య పాల్గొన్నారు.



మాచారెడ్డిలో ర్యాలీ తీస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

తప్పుల్లేకుండా సర్వే వివరాలు నమోదు చేయాలి



తాడ్వాయిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాజిద్ అలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ అన్నారు. ఆయన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని సందర్శించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో సవితారెడ్డి, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సర్వే వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ మండలం ఇప్పటి వరకు 40 శాతం పూర్తయినట్లు తెలిపారు.

క్లుప్తంగా

గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గణిత ఫోరం సహకారంతో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించాలని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణితంలో నైపుణ్యాలను పెంపొందించడానికి మండల స్థాయిలో ఈనెల 29న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 11న పరీక్షలు నిర్వహించాలన్నారు. రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 18న పరీక్ష ఉంటుందన్నారు. గణిత ఫోరం బాధ్యులు, అధికారుల సహకారంతో ఈ పరీక్షను నిర్వహించాలన్నారు.

అయ్యప్ప సేవా సమితికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప సేవా సమితికి సోమవారం పలువురు విరాళాలు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఉత్తర శబరిమళ అయ్యప్ప స్వామి, సేవా సమితి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ పేపర్లు, గ్లాసుల వాడకం నివారించడానికి దత్తు గురుస్వామి, ఉదయగిరి, రామారావు, ఆకుల సాయిలు స్వాములు 90 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు అందజేశారు. ముప్పిడి నగేష్ 30 కుర్చీలు, సామల చంద్రమౌళి 8 టేబుల్స్ అందజేశారు. వంట సామగ్రిని పర్మళ్లకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శ్రీరామ్, లక్ష్మీనారాయణగౌడ్ అందజేసినట్లు పేర్కొన్నారు. దాతలను అయ్యప్ప స్వాములు చంద్రమౌళి, శ్రీకాంత్, రవిగౌడ్ గురు స్వాములు ఘనంగా సన్మానించారు. సిద్దాగౌడ్, లింగాగౌడ్, సతీష్, రాజిరెడ్డి, రవి, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన జిల్లా అధ్యక్షుడు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): న్యూఢిల్లీలోని ఏఐసీసీ భవన్‌లో ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు రాకేశ్ లిలోతియాను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ.. నవంబర్ 26న జరిగే రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా నుంచి ఎంత మంది వచ్చారని ఆరా తీశారు. అదే విధంగా దళిత విభాగంలో పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర దళిత విభాగం అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం తప్పకుండా న్యాయం చేస్తారని అన్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పత్తికుమార్, తాడ్వాయి మండల ఉపాధ్యక్షుడు శివాజీ, తదితరులున్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ




సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిమ్మోజివాడిలో సోమవారం అదే పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు యాదవ్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన యాదవ్‌ను ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రజాక్ పాషా, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



మాచారెడ్డి: ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సోమారంపేట ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలకు సంబంధించిన ఫలితాలు వచ్చిన అనంతరం రక్తహీనత ఉన్న చిన్నారులకు గోలీలు పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

9వసారి రక్తదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన డాక్టర్ ఆర్తి సోమవారం 9వసారి రక్తదానం చేశారు. ఓ వృద్ధురాలికి ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా ఓ నెగెటివ్ రక్తం అవసరం కావడంతో డాక్టర్ ఆర్తి రక్తం దానం చేశారు. మానవతా దృక్పథంతో ఆర్తి రక్తదానం చేయడం పట్ల రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం.రాజన్న, సమన్వయకర్త బాలు అభినందించారు.

సంక్షిప్తం

29న గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎస్ వంశీకృష్ణ తెలిపారు. సమావేశంలో 2024–25 బడ్జెట్ ఆమోదం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అటెండర్ మృతి..సంతాపం తెలిపిన సిబ్బంది



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తహసీల్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేసిన లింగం ఇటీవల మృతి చెందడంతో సోమవారం తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీడీవో సాజిద్ అలీ, రెండు కార్యాలయాల సిబ్బంది సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా లింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. ఆదివారం నాటికి 34 వేల 40 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి బంటు భూమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బండ మాల వర్గాలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

బాన్సువాడ రూరల్: బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు వారు విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన వంటలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని కోరారు. నాయకులు మమ్మాయి లక్ష్మణ్, నల్లొల సాయిలు, దొంతుల రాజ్‌కుమార్, రాజశేఖర్, విష్ణువర్ధన్, సిద్దు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ దరఖాస్తును తిరస్కరించండి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివారులోని 137, 138, 139 సర్వే నంబర్లలో డీటీసీపీ లే–అవుట్ కోసం చేసిన దరఖాస్తును తిరస్కరించి తమకు న్యాయం చేయాలని లింగాపూర్‌కు చెందిన రైతులు బి.రాంరెడ్డి, సాయిరెడ్డి, శోభన్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తమ భూముల్లో కొందరు వెంచర్ వేస్తూ బెదిరిస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

కబ్జాకు గురైన భూమిని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో కబ్జాకు గురైన సొసైటీ భూమిని కాపాడాలని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నాయని మహిపాల్ యాదవ్ సోమవారం కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్లుగా భూమిని కాపాడాలని ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. 18 గుంటల భూమిని కాపాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.